క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి

మాకవరపాలెం : పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని జీ కోడూరు పంచాయతీ వార్డు సభ్యులు విన్నవించారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో చాయాసుధకు గ్రామానికి చెందిన 1, 2, 3, 12 వార్డుల సభ్యులు ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయన్నారు. అలాగే డ్రైనేజీలు సైతం పూడికతో దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

జీలుగులోవకు విద్యుత్ సదుపాయం



విద్యుత్ వెలుగులో జీలుగులోవ

రావికమతం : చీమలపాడు పంచాయతీ సామలమ్మ కొండపై ఉన్న జీలుగులోవ గిరిజన గ్రామానికి విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. చీకట్లో మగ్గిపోతున్నామని గ్రామస్తులు పలు సందర్భాల్లో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీ సమావేశాల్లో కాగడాలు చేతబట్టి ఆందోళన చేశారు. కలెక్టర్ జీలుగులోవలో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆదేశించడంతో జన్‌మన్ పథకంలో సోమవారం విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు.

విధుల్లో చేరిన నూతన హెచ్ఎంలు

మాకవరపాలెం: మండలంలోని మూడు ఉన్నత పాఠశాలలకు నూతనంగా నియమితులైన హెచ్ఎంలు విధుల్లో చేరారు. ఇటీవల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించిన సంతగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మాకవరపాలెం హైస్కూల్‌కు డి.నారాయణరావు, బూరుగుపాలెం హైస్కూల్‌కు మహాలక్ష్మి, జీ.కోడూరు హైస్కూల్‌కు జగదీష్‌లను హెచ్ఎంలుగా నియమించారు. ఈ మేరకు సోమవారం వారు విధుల్లో చేరారు.

కె.జె.పురంలో మోదమాంబ దీక్షల విరమణ



కె.జె.పురం మోదమాంబ ఆలయం వద్ద ఇరుముడులతో మాలధారణ భక్తులు

మాడుగుల రూరల్ : మోదమాంబ భక్తులు సోమవారం మాలధారణ దీక్షలు విరమించారు. గత నెల 13, 14, తేదీల్లో కె.జె.పురం గ్రామానికి చెందిన సుమారు 30 మంది భక్తులు అమ్మవారి మాలధారణ చేశారు. వీరు గ్రామంలో ఘటాలతో ఊరేగింపు జరిపారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన హోమగుండం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్షలు విరమించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాల నిరోధానికి రెవెన్యూ బృందాలు

చోడవరం : మండలంలో గ్రావెల్, ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను నియమించామని చోడవరం తహసీల్దార్ ఎ. రామారావు చెప్పారు. గజపతినగరం, జుత్తాడ, గవరవరం, లక్కవరం, రాయపురాజుపేట, నర్సాపురం, శీమునాపల్లి, వెంకన్నపాలెం, అంబేరుపురం ప్రాంతాల్లో అక్రమ ఇసుక, గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్టు పలు పత్రికల్లో వార్తలు రావడంతోపాటు జనసేన, కమ్యూనిస్టు పార్టీలు కూడా ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన రెవిన్యూ తనిఖీ బృందాలను నియమించారు. ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్ఓ, మహిళా పోలీసులతోపాటు ఆయా బృందాలను పర్యవేక్షించేందుకు మండలస్థాయి అధికారులను కూడా ఈ నియమించినట్టు తహసీల్దార్ రామారావు చెప్పారు.

ప్రొటోకాల్ విస్మరించిన డీలర్లపై చర్య తీసుకోవాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గొంప ఎంపీటీసీ సూర్యనారాయణ

రావికమతం : రేషన్ డిపోలో లబ్ధిదారులకు రేషన్ పంపిణీ కార్యక్రమంలో కనీస సమాచారం ఇవ్వని రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలని గొంప ఎంపీటీసీ గెంజి సూర్యనారాయణ సోమవారం డిప్యూటీ తహసీల్దార్ అప్పలనాయుడుకు ఫిర్యాదు చేశారు. గొంప ఎంపీటీసీ పరిధిలో ఉన్న గొంప, గుడ్డిప గ్రామాల్లో గల రేషన్ డిపోలను ఆదివారం ప్రారంభించారు. ప్రారంభం రోజున తనకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు.

వారపు సంత... అసౌకర్యాల చింత

- సంత వేలం పాట ద్వారా ప్రభుత్వానికి వేలాది రూపాయల ఆదాయం
- సంత స్థలంలో కొరవడిన మౌలిక సదుపాయాలు
- ఆరుబయటే క్రయవిక్రయాలు
- ట్రాఫిక్ రద్దీతో వ్యాపారులు, వినియోగదారులు సతమతం
- ఈ సంతపై 50పైగా గ్రామాల ప్రజలకు ఆధారం



అర్అండ్‌బి రోడ్డుకు ఇరువైపుల సంత నిర్వహణ 30ఎన్



రోడ్డుపై సంత నిర్వహణతో ట్రాఫిక్ సమస్య



ఇరిగేషన్ స్థలంలో తాటాకు పాకలు వేసుకుని సంతలో విక్రయాలు చేస్తున్న వ్యాపారులు

నాతవరం : ప్రభుత్వానికి వారపు సంత వేలం పాట ద్వారా అదాయం వస్తున్న వ్యాపారులకు వసతి సముదాయం కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ప్రతి మంగళవారం వారపు సంత నిర్వహిస్తుంటారు. మండల వాసులంతా ఈ సంతలో నిత్యవసర సరుకులు కొనుగోలు చేస్తుంటారు. సంత వేలం పాట ద్వారా మండల పరిషత్ కార్యాలయానికి ఏడాదికి రూ.60వేలు నుంచి 70వేల మధ్య ఆదాయం వస్తుంది. ప్రతి ఏటా మార్చిలో ఎంపీడీవో ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తారు. ఈ వారపు సంతను మొదట్లో నాతవరం గ్రామ శివారు గుమ్మడిగొండ వెళ్లే దారిలో ప్రభుత్వానికి చెందిన స్థలంలో నిర్వహించేవారు. సంత నిర్వహించే స్థలంలో షెడ్లు నిర్మించేందుకు అధికారులు సంతను నాతవరం ప్రధాన కూడలి జంక్షన్ తాండవ వెళ్లే అర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఇరిగేషన్ స్థలంలోకి మార్పు చేశారు. కొంతకాలంగా ప్రతి మంగళవారం వారపు సంత వ్యాపారులు ఇరిగేషన్‌కు చెందిన స్థలంలోనే నిర్వహిస్తూ ఇబ్బందుల నడుమ కాలం వెళ్లదీస్తున్నారు. ఇక్కడ ఎలాంటి వసతి సముదాయాలు ఏర్పాటు చేయలేదు. ఎండ కాచినా వర్షం పడిన వ్యాపారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొందరు వ్యాపారులు సొంత డబ్బుతో తాత్కాలికంగా తాటాకు పాకలు వేసుకొని ప్రతి మంగళవారం క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. మిగిలిన వారు ఆరు బయట ఎండలోనే రోడ్డు మార్జిన్‌లోనే దుకాణం పెట్టి విక్రయాలు సాగిస్తున్నారు. సంత ప్రదేశంలో ఒక వైపు లోతైన గెడ్డ మరో వైపు నిండుగా నీటితో చెరువు ఉంది. మధ్యలోంచి అర్అండ్‌బీ రోడ్డు ఉండడంతో సంతకు వచ్చే వినియోగదారులు, వ్యాపారులకు ఇక్కట్లు తప్పడం లేదు. సాయంత్రం 3గంటల నుంచి వాహనాల రద్దీ అధికంగా ఉండడంతో ప్రతి మంగళవారం వారపు సంతలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మండల పరిషత్ అధికారులు వారపు సంత ద్వారా అదాయం పొందుతున్నారు తప్ప మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టడం లేదని వ్యాపారులు, వినియోగదారులు విమర్శిస్తున్నారు. ప్రతి మంగళవారం సరుగుడు, సుందరకోట, కె.వి.శరభవరం గిరిజన పంచాయతీలు శివారు 25 గ్రామాలు, మైదాన ప్రాంతంలో 30పైగా గ్రామాల ప్రజలు నిత్యవసర సరుకుల కోసం ఈ సంతపైనే ఆధారపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారపు సంతలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు దృష్టి సారించాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



ప్రతి మంగళవారం వారపు సంతకు కాయకూరలు కొనుగోలు చేయడానికి వెళ్లే వారు విక్రయాలు చేసే వ్యాపారులు అనేక బాధలు పడుతున్నారు. ఆ రోజు ట్రాఫిక్‌లో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం అన్యాయం. అధికారులు స్పందించకపోతే ఆందోళన చేస్తాం. –అడిగర్ల రాజు, సీపీఎం మండల శాఖ కార్యదర్శి

కూటమి ప్రభుత్వ మోసాలపై పోరుబాట

- 4న వెన్నుపోటు దినం
- భారీ బైక్ ర్యాలీ
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు

నర్సీపట్నం : కూటమి దగా పాలనకు నిరసనగా ఈ నెల 4న వైఎస్సార్‌సీపీ నిర్వహించ తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, ప్రజలు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో సోమవారం వెన్నుపోటు దినం పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నమ్మి ఓట్లేసిన ప్రజలను చంద్రబాబు నట్టేట ముంచారన్నారు. ఏడాది పాలనలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను గాలికొదిలేసారన్నారు. కూటమి నేతలు మోసాలు, అరాచకాలు, అన్యాయాలకు నిరసనగా వెన్నుపోటు దినంలో భాగంగా భారీ బైక్ ర్యాలీ చేపట్టామన్నారు. ఉదయం 10 గంటలకు సీబీఎం కాంపౌండ్ నుంచి పెద్దబొడ్డేపల్లి జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఈ బైక్ ర్యాలీ ద్వారా ప్రజల గొంతును ప్రభుత్వానికి తెలియజేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, సినీనటుడు జోగినాయుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, టౌన్ పార్టీ అధ్యక్షులు ఏకా శివ, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

బూటకపు హామీలతో చంద్రబాబు మోసం



కె.కోటపాడులో వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్, పార్టీ నాయకులు

కె.కోటపాడు : మోసపూరిత హామీలతో రాష్ట్ర ప్రజలను చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. ఈ నెల 4న వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాడుగులలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పిలుపు మేరకు నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రెడ్డి జగన్‌మోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత ఎన్నికల కాలంలో అలవికాని హామీలను ప్రజలకు ఇచ్చి అధికారంలోనికి వచ్చి ఏడాది పూర్తవుతున్నా అమలు చేయని కారణంగా ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలనిన్నారు. మాడుగులలో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమంలో మండలం నుంచి పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, చీపురుపల్లి అచ్చిబాబు, లెక్కల గౌతమి, శంకరరావు, యూత్ సభ్యులు ఆకుల సాయి ప్రసాద్, గంతకర్ల సతీష్ పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, సర్పంచ్ సూర్యనారాయణ పార్టీ నాయకులు



మాడుగులలో పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపీపీ రాజారామ్, మండల పార్టీ అధ్యక్షుడు పెదబాబు

మాడుగుల : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 4వ తేదీన నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు పిలుపునిచ్చారు. సోమవారం మాడుగులలో దీనికి సంబంధించిన గోడ పత్రికలను ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు శానాపతి కొండలరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పాలిమేర విజయలక్ష్మి, సర్పంచ్ కళావతి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాధు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ పైడిబాబుతో పాటు పార్టీ నాయకులు కొట్యాడ భాస్కర్, పుట్టా మురళీకృష్ణ, యడ్ల హేమంత్, రాఖీ శ్రీను, ఖాతా వెంకటరమణ పాల్గొన్నారు.

నాతవరం : ఈనెల 4వ తేదీన నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ తలపెట్టిన నిరసన వెన్నుపోటు దినం పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈవిషయాన్ని గుర్తు చేస్తూ ఏడాది పాలన సందర్భంగా చేసిన ఆరాచకాలను నిరసన రోజు ఎండ కట్టాలన్నారు. ప్రజల సంక్షేమ అభివృద్ధి కంటే కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసేందుకే అధిక ప్రాధాన్యం ఇస్తుందన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. మండలంలో గల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీశ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో విచ్చేసి నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గునుపూడి సర్పంచ్ వేముల సూర్యనారాయణ మాజీ ఎంపీటీసీ సభ్యుడు వైఎస్సార్‌సీపీ మండల శాఖ బీసీ సెల్ అధ్యక్షుడు వేముల సూరిబాబు, యూత్ నాయకులు చిటికిల రామకృష్ణ పాల్గొన్నారు.

బైలపూడిలో..

చీడికాడ : కూటమి పాలనలో వైఫల్యాలపై ఈ నెల 4న మాడుగులలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. మండలంలోని బైలపూడిలో సోమవారం మండల వైఎస్సార్‌సీపీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు నిరసన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసాన్ని ఎండగడుతూ నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు స్వామినాయుడు, పార్టీ నేతలు చుక్కా అప్పలనాయుడు, కురచా నారాయణమూర్తి, ఈశ్వరరావు, తారకేసు, సన్యాసినాయుడు, పరువాడ అప్పారావు, షేకు సూర్యనారాయణ, కొండబాబు పాల్గొన్నారు.



గోడపత్రిక విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రోలుగుంట జెడ్పీ హైస్కూలు హెచ్ఎంగా శేషగిరి



హెచ్ఎం శేషగిరిని సత్కరిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

రోలుగుంట : రోలుగుంట జెడ్పీ ఉన్నతపాఠశాలలో హెచ్ఎంగా పని చేసిన బీవీఎస్ ప్రసాద్ మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలం తగరంపూడికి ఇటీవల జరిగిన బదిలీల్లో బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చోడవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన హెచ్ఎం టి.వి.శేషగిరి బదిలీపై వచ్చి సోమవారం విధుల్లో చేరారు. ఆయనకు ఉపాధ్యాయులు, నాన్ టీచింగు ఉద్యోగులు, సిబ్బంది, సీఆర్పీలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

నేడు రైవాడ ఎరుకలమ్మ తల్లి పండగ



రైవాడ ఎరుకులమ్మతల్లి

దేవరాపల్లి : మండలంలో రైవాడ గ్రామ ఆరాధ్య దైవం, భక్తుల తీర్చే కల్పవల్లి ఎరుకలమ్మ అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యుద్దీపాలంకరణ చేశారు. 13 సంవత్సరాల తర్వాత ఈ పండగ జరపడంతో గ్రామమంతా బంధుమిత్రులతో సందడి నెలకొంది. పండగ చాటింపు రోజు నుంచి నెల రోజుల పాటు అమ్మవారి గరగలు ఊరేగించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భారీ స్థాయిలో బాణసంచా కాల్చనున్నారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి పూజలు నిర్వహించనున్నారు.

సందడిగా కోటమ్మతల్లి గరగల సంబరం



గరగల సంబరానికి ముందు అమ్మవారికి పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నాతవరం: మండల కేంద్రంలో వెలసిన శ్రీకోటమ్మ తల్లి పండగ సందర్భంగా సోమవారం గరగల ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారికి ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత గరగలను పురవీధులతో ఊరేగించారు. ఈనెల 3వ తేదీన అమ్మవారి పండగ సందర్భంగా పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయం ప్రకారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రాట ఏర్పాటు చేసి సంబరాలు చేశారు. మూడేళ్లకోసారి ఈ పండగ జరపడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఘనంగా ఏర్పాటు చేశారు. గ్రామంలో విద్యుదలంకరణ చేశారు. మహిళల కోలాటం, భజనలు, శక్తి వేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మంగళవారం రాత్రికి ఆలయ ప్రాంగణంలో బాణసంచా వెలిగించనున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఎస్ఐ భీమరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రెండో రోజూ తప్పని రేషన్ కష్టాలు



వడ్డాదిలో రేషన్ కోసం నిరీక్షణ

బుచ్చెయ్యపేట : పలు గ్రామాల్లో ప్రజలకు రేషన్ కష్టాలు తప్పడం లేదు. వడ్డాది పాత కోఆపరేటివ్‌లో నడుస్తున్న రేషన్ డిపోలో వేయింగ్ మెషిన్ పనిచేయడం లేదు. దీంతో సోమవారం ఉదయం రేషన్ డిపో తీయలేదు. పలువురు రేషన్ బియ్యం కోసం డిపో వద్ద పడిగాపులు కాశారు. గున్నెంపూడి ఎస్సీ కాలనీలో ఉన్న రేషన్ షాపులో ఈ పోస్ మెషిన్ పనిచేయకపోవడంతో అక్కడ ప్రజలు నిత్యవసర వస్తువులు సక్రమంగా అందక నిరీక్షిస్తున్నారు. పి.భీమవరం రేషన్ డీలర్‌పై 6ఎ కేసు ఉండడంతో చిన అప్పనపాలెం డీలర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ గ్రామ డిపోలోకి సిగ్నల్ సరిగా రాకపోవడంతో అక్కడ ప్రజలు గంటల తరబడి రేషన్ బియ్యం కోసం పడిగాపులు కాస్తున్నారు. తొలిరోజు ఆరుగురికి మాత్రమే రేషన్ బియ్యం అందగా మిగిలిన వారికి నెమ్మదిగా అందుతున్నాయి.

మాడుగుల రూరల్ : రేషన్‌డిపోల ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమం సాంకేతిక సమస్యల వల్ల సర్వర్ పనిచేయక వినియోగదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా ఆదివారం రేషన్ డిపోలు ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. రెండో రోజు సోమవారం కూడా వేలిముద్రలు వేసే మిషన్లు సర్వర్ సమస్యతో మొరాయించాయి. దీంతో ఉదయం నుంచి రేషన్ డిపోల వద్ద వినియోగదారులు పడిగాపులు కాసారు. కె.జె.పురంలో 41 వ డిపో వద్ద ఉదయం 10 గంటల నుంచి రేషన్ కొరకు వచ్చిన వినియోగదారులు సర్వర్ పనిచేయక ఇబ్బందులు పడి తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు.

ముద్దుర్తిలో రేషన్ పంపిణీ ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

చోడవరం : పేదల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్ అన్నారు. ముద్దుర్తి గ్రామంలో రేషన్ దుకాణాల ద్వారా రేషన్ ఇచ్చే కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎన్ రాజుతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ షాపుల్లో సరుకులు ఇవ్వడం వల్ల వినియోగదారుడు ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్లి సరుకులు తీసుకోవచ్చని, నెలలో 15 రోజుల పాటు రేషన్ సరఫరా జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు, మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

5న రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట



సత్యవరంలో ప్రతిష్టకు సిద్ధం చేసిన రామలింగేశ్వరస్వామి ఆలయం



ఆలయ ప్రాంగణంలో యాగశాల నిర్మాణం

మాడుగుల : మండలంలో సత్యవరం గ్రామంలో ఈ నెల 5 వ తేదీన రామలింగేశ్వర స్వామి ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఇప్పటికే ఆలయానికి రంగులు అద్దడంతో పాటు యాగశాల నిర్మాణం చేపట్టారు. 2వ తేదీన సాయంకాలం 3 గంటలకు భారీ మందుగుండు సామగ్రి, కళ్లు మిరిమిట్లు గొలిపే విద్యుదలంకరణలు, తీన్‌మార్ డప్పులు, భజనల నడుమ స్వామివారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాపీమేస్త్రికి కూలీల సత్కారం



తమకు ఉపాధి కల్పిస్తున్న తాపీమేస్త్రి నడిపల్లి రమణకు సత్కారం చేస్తున్న కూలీలు

చోడవరం : రోజువారీ కూలీలకు ప్రతి రోజూ కూలిపని కల్పిస్తున్న తాపీమేస్త్రిని ఉపాధి పొందుతున్న కూలీలు, భవననిర్మాణ యజమానులు సోమవారం ఘనంగా సత్కరించారు. నరసయ్యపేట గ్రామానికి నడిపల్లి రమణ అనే తాపీమేస్త్రి సుమారు 20 ఏళ్లుగా మేస్త్రి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇతనితో పాటు మరో 70 మంది కూలీలకు, తాపీమేస్త్రిలకు రోజూ పని కల్పిస్తూ వారందరికీ జీవనాధారంగా మారాడు. దీంతో వారంతా రమణను ఘనంగా సత్కరించారు. ఆయన చూపిస్తున్న జీవనాధారానికి పలువురు భవన యజమానులు కూడా అభినందనలు తెలిపారు. రమణ ఎందరికో ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో జుంజూరు అప్పారావు మాస్టారు, వంకర నాని, శైలజ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

చీడికాడ : మండలంలోని మంచాల మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రదర్శించినట్టు ప్రిన్సిపాల్ సిహెచ్.వెంకటలక్ష్మి తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ 4వ నెల 21న ప్రవేశ పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ జాబితాలో తమ పేర్లు పరిశీలించుకోవాలని ఆమె కోరారు. మెరిట్ కం రోస్టర్ ఆధారంగా ఎంపికైనా వారికి ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

కె.కోటపాడు : కింతాడ పంచాయతీ జోగన్నపాలెం గ్రామస్తులు అభయాంజనేయ స్వామి ఆలయ 12వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా జరిపారు. వార్షికోత్సవ పర్వదినం కావడంతో స్వామివారికి పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాలు జరిపేందుకు బారులు తీరారు. తమల పాకులతో సామూహిక అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిపారు. జోగన్నపాలెంతో పాటు పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, ముత్యాలనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాకిట్ల పంపిణీ

మాకవరపాలెం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీ చేశారు. ఈ మేరకు వజ్రగడ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు సోమవారం మొదటి విడతగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీ, బెల్టులతో కూడిన కిట్లను యా పాఠశాలలకు తరలించినట్టు ఎంఈవోలు జాన్‌ప్రసాద్, మూర్తి తెలిపారు. త్వరలో బ్యాగ్స్, యూనిఫారమ్, బూట్లు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.